# బాలికల భద్రత -- సమాజ బాధ్యత...

# జమ్మికుంటలో భారీ అవగాహన ర్యాలీ, పోటీలు,

**- బహుమతుల ప్రదానం ఘనంగా నిర్వహణ**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 15**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో 15-04-2026 నాడు బాలికల భద్రత, సాధికారత, విద్యాభివృద్ధి పై అవగాహన కల్పించే ఉద్దేశంతో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. పట్టణ సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలో, హుజురాబాద్ ఎసిపి మాధవి మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమం పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలికల పాఠశాలలో విద్యార్థినుల కోసం రైటింగ్ పోటీలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలు విజయవంతం చేశారు. బాలికలలో ఆలోచనా శక్తి, సృజనాత్మకత, సమాజంపై అవగాహన పెంపొందించేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయి.

పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు మొదటి, రెండవ, తృతీయ బహుమతులను అధికారులు అందజేశారు. విజేతలను అభినందిస్తూ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించారు. పాల్గొన్న ప్రతి విద్యార్థినిని కూడా అధికారులు ప్రశంసించి, వారి ధైర్యాన్ని అభినందించారు.





అనంతరం విద్యార్థినులతో కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జమ్మికుంట వీధులలో సాగుతూ ప్రజల దృష్టిని ఆకర్షించింది. బాలికల భద్రత, మహిళల హక్కులు, సమానత్వం, విద్య యొక్క ప్రాముఖ్యత వంటి అంశాలపై విద్యార్థినులు నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు.

ర్యాలీ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, బాలికల భద్రత కేవలం కుటుంబం లేదా ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా సమాజం మొత్తం బాధ్యత అని స్పష్టం చేశారు. బాలికలపై జరిగే అన్యాయాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

బాలికలు భయపడకుండా విద్యను అభ్యసించి, సమాజంలో ముందుకు రావాలని, వారి లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం మరియు పోలీసు శాఖ పూర్తి మద్దతు అందిస్తుందని తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు బాలికలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు సమాజంలో మంచి మార్పును తీసుకురాగలవని అధికారులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరితంగా సాగి, బాలికల సాధికారతకు ఒక ప్రేరణగా నిలిచింది.

మొత్తంగా జమ్మికుంట పట్టణంలో నిర్వహించిన ఈ కార్యక్రమం బాలికల భద్రత, హక్కులు, విద్య ప్రాముఖ్యతపై సమాజానికి స్పష్టమైన సందేశాన్ని అందించింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని అధికారులు సంకల్పం వ్యక్తం చేశారు.

## రాచపల్లి బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభించిన సర్పంచి బూస అశోక్

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట ఏప్రిల్ 15**
కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామ బస్టాండ్ ఆవరణలో గ్రామ సర్పంచ్ బూస అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. మండుతున్న ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు, గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం విశేషం.

ప్రారంభ కార్యక్రమంలో సర్పంచ్ బూస అశోక్ యాదవ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, వేసవి కాలంలో ప్రజలకు అవసరమైన తాగునీరు అందించడం ఎంతో ముఖ్యమని అన్నారు. ముఖ్యంగా బస్టాండ్ ప్రాంతంలో రోజూ వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారని, వారికి శుద్ధమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు




తెలిపారు.

అదేవిధంగా, గ్రామంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉండేలా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. వేసవి కాలంలో చలివేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, ముఖ్యంగా వృద్ధులు, కార్మికులు, విద్యార్థులు దీనివల్ల ఉపశమనం పొందుతారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూష అశోక్ యాదవ్ వార్డ్ మెంబర్లు చిదురాల నాగేష్ గుప్తా.మాకు అశోక్, గుంటి రాజు, ఆరెల్లి రాయ మల్లు, ముంజాల సదానందం. ఎండి సందన్ .తదితరులు పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మంచి సందేశాన్ని ఇస్తాయని, ప్రతి గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ, సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వేడి కాలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండే సమయంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా మంచిదని అన్నారు. ప్రయాణికులు కూడా ఈ చలివేంద్రం ద్వారా తాగునీరు అందుబాటులో ఉండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.గ్రామంలోని యువత, పెద్దలు కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం గమనార్హం. చలివేంద్రం నిర్వహణను సక్రమంగా కొనసాగించాలని, ఎల్లప్పుడూ శుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు.

## రోడ్డు ప్రమాదాలు, గనుల ప్రమాదాలపై అప్రమత్తత అవసరం...

**- గోల్డెన్ అవర్‌లో చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశం**
**- కరీంనగర్ మెడికవర్ వైద్యుల వెల్లడి**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 15:**
రోడ్డు ట్రాఫిక్ ప్రమాదాలు, బొగ్గుగనుల్లో జరిగే ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ మెడికవర్ వైద్యుల సూచించారు. ముఖ్యంగా ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటను “గోల్డెన్ అవర్”గా పరిగణిస్తారని, ఈ సమయంలో సరైన వైద్య సదుపాయాలు ఉన్న ఆసుపత్రికి రోగిని తరలిస్తే ప్రాణాలను కాపాడే అవకాశం పదింతలు పెరుగుతుందని తెలిపారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యూరోసర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాకేశ్, ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. సింగరేణి ప్రాంతాల్లో గనుల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ఇలాంటి సందర్భాల్లో



వేగవంతమైన వైద్య చికిత్స అత్యంత కీలకమని పేర్కొన్నారు. తలకు తగిలే గాయాలు ప్రమాదాల్లో ప్రధాన కారణమవుతున్నాయని, ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సీటీ స్కాన్ వంటి పరీక్షలు చేయగలిగితే అంతర్గత గాయాలను త్వరగా గుర్తించి చికిత్స అందించవచ్చని చెప్పారు. ట్రామా కేర్ విషయంలో తాము అగ్రస్థానంలో ఉన్నామని తెలిపారు. పాలీట్రామా అంటే ఒకే రోగికి శరీరంలోని అనేక అవయవాలు దెబ్బతినే పరిస్థితి. ఇలాంటి కేసుల్లో న్యూరోసర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు కలిసి సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని వివరించారు. అన్ని రకాల నిపుణులు అందుబాటులో ఉండే ఆసుపత్రిలోనే ఇలాంటి క్లిష్ట కేసులకు సమర్థవంతమైన చికిత్స సాధ్యమవుతుందని చెప్పారు. ఇంటి వద్ద జరిగే సాధారణ గాయాల విషయంలో కూడా నిర్లక్ష్యం చేయకూడదని, వీలైనంత త్వరగా వైద్య చికిత్స పొందాలని సూచించారు. ప్రతి గాయం చిన్నదే అనుకుని వదిలేస్తే అది పెద్ద సమస్యగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రమాద ఘటనల్లో రోగి స్పృహలో లేని పరిస్థితుల్లో న్యూరోసర్జన్‌తో పాటు ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యుల పాత్ర కీలకమని, రోగిని సమగ్రంగా చూసుకోవడంలో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, బొంగోని హరీష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సిరిసేడు చిన్నారులతో రహదారి భద్రతా దినోత్సవం ఘనంగా అవగాహన కార్యక్రమాలతో సమాజానికి బలమైన సందేశం

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, ఏప్రిల్ 15:**
ప్రజల ప్రాణ రక్షణ లక్ష్యంగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట రూరల్ పోలీసు అధికారి మరియు ఇల్లందకుంట ఉప నిరీక్షకుడు సంయుక్త ఆధ్వర్యంలో సిరిసేడు ప్రాథమిక పాఠశాలలో రహదారి భద్రతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారుల్లోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులకు రహదారి భద్రతపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత, హెల్మెట్




ధరించడం అవసరం, రోడ్డు భద్రత వంటి అంశాలను తమ రచనలు, చిత్రాల ద్వారా అద్భుతంగా ప్రతిబింబించారు. విజేతలకు అభినందనలు తెలుపుతూ అధికారులు విద్యార్థులను ప్రోత్సహించారు. అదేవిధంగా, హెల్మెట్ ధరించడం ప్రాణ రక్షణకు ఎంత ముఖ్యమో వివరించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పోస్టుకార్డుల ద్వారా లేఖలు రాసి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సందేశాన్ని చేరవేశారు. చిన్నారుల ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం అందరినీ ఆకట్టుకుంది. మరింతగా, సిరిసేడు కేంద్రంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలతో కలిసి భారీ మానవహారం ఏర్పాటు చేసి రహదారి భద్రతపై సామూహిక చైతన్యం కల్పించారు. “ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం -- ప్రాణాలను కాపాడుకుందాం” అనే నినాదాలతో గ్రామం మార్మోగింది. ఈ కార్యక్రమాన్ని విస్తృతం చేస్తూ మండలంలోని మల్యాల మరియు ఇల్లందకుంట ప్రభుత్వ పాఠశాలల్లో కూడా వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జీబ్రా క్రాసింగ్ వినియోగం, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ అవసరం వంటి అంశాలపై అధికారులు సవివరంగా అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చిన్నారుల్లోనే రహదారి భద్రతపై చైతన్యం పెంపొందిస్తే సమాజంలో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం ప్రాణ నష్టానికి దారితీస్తుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు, పోలీసు సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రహదారి భద్రతపై ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

## మేడ్చల్‌లో 16 డివిజన్లు ఏర్పాటు



**▪ నా మీద పగతోనే ఇదంతా.. మల్లారెడ్డి**

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
తనపై పగతోనే మేడ్చల్‌లో 16 డివిజన్లు ఏర్పాటు చేశారని మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. పీర్జాదిగూడలో బీఆర్ఎస్‌లోకి చేరికల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో తనను ఓడించాలని ప్రచారం చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రత్యర్థులకు వణుకు పుట్టించారని తెలిపారు. దేశంలోనే పెద్ద నియోజకవర్గమైన మేడ్చల్‌లో స్థానిక నాయకులను తగ్గించారని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు.

## క్వారీలో ఈతకు వెళ్లి గల్లంతైన విద్యార్థి

**▪ మృతదేహం వెలికితీత**

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిర్మాపూర్ మల్లన్న గుట్ట వద్ద ఉన్న క్వారీలో మంగళవారం ఈతకు వెళ్లి గల్లంతైన బీకాం రెండో సంవత్సరం విద్యార్థి సూరజ్ (22) మృతదేహాన్ని డీఆర్ఎఫ్ బృందం వెలికితీసింది. మహారాష్ట్రకు చెందిన సూరజ్, తన నలుగురు స్నేహితులతో కలిసి క్వారీలో ఈతకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు.



## సాంకేతిక లోపంతో నిలిచిపోయిన ఎలక్ట్రిక్ బస్సు




**▪ మెట్టుపల్లి లో ట్రాఫిక్ జామ్**

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
మెట్పల్లి పట్టణంలో నిజామాబాద్ నుండి హనుమకొండకు వెళ్లే ఎక్స్ప్రెస్ ఎలక్ట్రిక్ బస్సు సాంకేతిక లోపం కారణంగా నడిరోడ్డుపై ఆగిపోయింది. దీనివల్ల ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ ఎలక్ట్రిక్ బస్సులు కరీంనగర్, నిజామాబాద్ డిపోలలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సాంకేతిక నిపుణులు వచ్చే వరకు బస్సు అక్కడే నిలిచి ఉంటుందని డ్రైవర్ తెలిపారు. గతంలో కూడా ఇదే ఎక్స్ ప్రెస్ బస్సు వల్ల పాత బస్టాండ్ వద్ద ప్రమాదం జరిగింది.

## రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం పై కోరుట్ల ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
జగిత్యాల నిజామాబాద్ ప్రధాన రహదారిపై బ్రిడ్జి నిర్మాణం కోసం రోడ్డు తవ్విన కాంట్రాక్టర్ పై కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 20వ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జగిత్యాల పర్యటన సందర్భంగా, నిజామాబాద్, బాల్కొండ, కోరుట్ల, బోధన్ నియోజకవర్గాల నుండి సుమారు 30,000 మంది ప్రజలు బహిరంగ సభకు వస్తారని, కావున పనులను వారం పాటు వాయిదా వేయాలని కాంట్రాక్టర్ ను కోరినట్లు తెలిపారు. అయితే, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా నిన్ననే పనులు ప్రారంభించాడని ఆయన ఆరోపించారు.

## పిల్లల ఎదుగుదలకు పోషకాహారమే ముఖ్యం..

చిన్నపిల్లల ఎదుగుదలకు, అభివృద్ధికి సరైన పోషకాహారం కీలకమని కందుగుల ఉపసర్పంచ్ మంద సతీష్ అన్నారు. బుధవారం మండలంలోని కందుగుల గ్రామంలో పోషణ పక్వాడ లో భాగంగా ప్రీ స్కూల్ మేళ, అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువగా మాట్లాడడం, ఆటలు ఆడించడం, ప్రేమగా చూసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

